## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. నూర్‌ఖాన్ బజార్, చాదర్‌ఘాట్, చంచల్‌గూడ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### నేడు, రేపు సిటీ కాలేజ్‌లో అంతర్జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మార్చి 9, 10 తేదీల్లో తెలుగు సాహిత్యం–పర్యావరణ చైతన్యం అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని సదస్సు సంచాలకులు డాక్టర్ జె.నీరజ, డాక్టర్ కోయి కోటేశ్వరరావు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) ఆర్థిక సౌజన్యంతో కళాశాల ఆజం హాల్‌లో జరిగే ప్రారంభ సభలో రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా, మున్సిపల్ పరిపాలన, నగరాభివృద్ధి విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్, డాక్టర్ మామిడి హరికృష్ణ, దుశ్చర్ల సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్‌రావు సభకు అధ్యక్షత వహిస్తారన్నారు. తెలంగాణ ప్రజా కవులు తమ పాటల్లోని పర్యావరణ దృక్పథాన్ని వివరిస్తారన్నారు.

### అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకర్‌యాదవ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ బీజేపీ ఫ్లోర్ లీడర్ గొంటి శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్లతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

### ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తా

గోల్కొండ: సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో తనని కలవడానికి వచ్చిన వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన తనవద్దకు వచ్చిన వారి సమస్యలు విని ఒక ట్రెండు రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన కార్వాన్, గోల్కొండ తదితర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు.

### ఘనంగా సెరా కార్యక్రమం



డబీర్‌పురా: 12వ ఇమామ్ జయంతి సందర్భంగా సెరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ, డబీర్‌పురా కార్పొరేటర్ ఆలంధార్ వాల్‌జాహీ, డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, అంజుమన్–ఇ–మాసుమీన్ సభ్యులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో ఓపీ కౌంటర్లు పెంచాలి

గోల్కొండ: మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న కౌంటర్ల వద్ద ఉదయం 7 గంటల నుంచే రోగులు బారులు తీరుతున్నారు. తెలంగాణ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వారు సైతం కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సల కోసం ఇక్కడకు వస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు దవాఖానాకు వచ్చే సరికి ఆ రోజు ఓపీ స్లిప్ అందడం లేదు. దీంతో వారు తిరిగి ఇంటికి వెళ్లలేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఔట్ పేషెంట్ విభాగం కౌంటర్లను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న పురానాపూల్ ఎస్‌బీఐ మేనేజర్ అనిల్‌కుమార్



కాంగ్రెస్ నాయకురాలు శైలజ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో..



జర్నలిస్టులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఆనంద్‌రావు



బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో..

# వనితకు వందనం..!

- ఘనంగా మహిళా దినోత్సవం
- పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించిన ప్రముఖులు



ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో..



చీరలు పంపిణీ చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, సలావుద్దీన్ లోధి

చార్మినార్: తమ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని హోంమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చార్మినార్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో బుధవారం ఖిల్వత్‌లోని ఉర్దూ మస్కాన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ రంగాల్లోని వైద్యులు, న్యాయవాదులు, నర్సులు, ఆశా వర్కర్లు, సఫాయి కర్మచారిలకు హోంమంత్రి మహమూద్ అలీ శాలువాలు కప్పి సత్కరించారు. ఆశా వర్కర్లతో పాటు నర్సులు, సఫాయి కర్మచారిలకు మిఠాయి డబ్బాలతో పాటు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన, వైద్య, ఆరోగ్య, విద్య, రాజకీయ రంగాల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెండ్యాల లక్ష్మణ్‌రావు, రవీశ్వర్ పాల్గొన్నారు.

#### జర్నలిస్టులకు సత్కారం..

చార్మినార్: జర్నలిజంలో మహిళా రిపోర్టర్ల పాత్ర కీలకం అని, ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.ఎస్.ఆనంద్‌రావు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా విలేకరులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున మహిళా జర్నలిస్టులకు సరైన ప్రోత్సాహం లభించడం లేదన్నారు. అయినప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారు కృషి చేస్తున్నారన్నారు.

#### పురానాపూల్ ఎస్‌బీఐలో..

జియాగూడ: బ్యాంకుల్లో మహిళా సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్‌బీఐ పురానాపూల్ బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్యాంక్‌లో పనిచేస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కె.రమేష్‌కుమార్, డి.శ్రీనివాస్, ఉష, మనోహర్ ప్రసాద్ థాత్రే తదితరులు పాల్గొన్నారు.

#### ఉస్మానియా ఆస్పత్రిలో..

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ మహిళా వైద్యులకు, సిబ్బందికి, నర్సింగ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలను ఆయన సన్మానించి అభినందించారు.

#### విదుషీమణుల పేరుతో సదస్సు..

సుల్తాన్‌బజార్: వికాసంలో రచయిత్రిల కృషిని మననం చేసుకుని ప్రేరణ పొందే కార్యక్రమాలను నిర్వహించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి నెలకొల్పిన సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ కళా మందిరంలో విదుషీమణులు పేరుతో ప్రాచీన, ఆధుని కవయిత్రులు, రచయిత్రుల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సుశీల నారాయణరెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ.. రచయిత్రులకు పురస్కారాలు, గ్రంధ ముద్రణకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలు చేస్తున్నామని, ఇకపై ప్రత్యేకంగా రచయిత్రుల సాహిత్య సేవల గురించి సదస్సులు, శతజయంతులు నిర్వహిస్తామని తెలిపారు.

#### ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మహిళల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాక్షి సీనియర్ చీఫ్ రిపోర్టర్ కట్ట కవిత, యశోదా హాస్పిటల్ డెర్మటాలజిస్ట్ డాక్టర్.డి.గౌరీ, లైఫ్ ఫౌండేషన్ హోప్ స్థాపకురాలు హిమజ, మహ్రాఅలీలను ఘనంగా సన్మానించారు. ఎస్‌బీఐ సీజీఎం అమిత్ జింగ్రన్ మాట్లాడుతూ.. భారతీయ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర గొప్పదన్నారు. రక్షణ రంగంలోని ప్రముఖ పోస్టులలో మహిళలు పురోగమిస్తున్నారని, ఎస్బీఐలో అత్యధికంగా మహిళా ఉద్యోగులే ఉన్నారన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మంజు శర్మ, మహిళా అధికారులు, డీజీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.



మహిళా వైద్యులను సన్మానించిన డాక్టర్ నాగేందర్, డాక్టర్ శేషాద్రి తదితరులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు దీపాంకర్‌పాల్ రవి



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు జీవన్‌సింగ్



చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు నందకిశోర్ వ్యాస్ బిలాల్



సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో..



యోగా సంస్థాన్ సభ్యురాలు సరోజ ఆధ్వర్యంలో..



అలియాబాద్ యూపీహెచ్‌సీలో..



పురానాపూల్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో..

## సరికొత్త రుచులతో హలీం



హలీంతో సందడి చేస్తున్న మోడల్స్

గోల్కొండ: రంజాన్ మాసం ప్రారంభానికి ముందే నోరూరించే హలీంను సరికొత్త రుచులతో అందిస్తున్నామని మాసబ్‌ట్యాంక్‌లోని కేఫ్ 555 మేనేజింగ్ డైరెక్టర్ అలీరెజా అన్నారు. బుధవారం రెస్టారెంట్‌లో ఆయన పలువురు మోడల్స్‌తో కలిసి నల్లి ఘోష్ హలీం అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం తాము కొత్తగా నగరంలోనే మొదటి సారిగా ఆర్గానిక్ సాఫ్రాన్ ఏఎస్‌ఎల్ హలీంను అందిస్తున్నామన్నారు. హలీంకు వాడే పొట్టేలు మాంసాన్ని తక్కువ ఉష్ణోగ్రతలో నెమ్మదిగా ఉడికిస్తామని, దీని వల్ల మాంసం రుచి మరింత పెరుగుతుందని చెప్పారు. ఇది పర్షియన్ స్టైల్ అన్నారు. హలీంకు టాపింగ్‌గా చికెన్ 65, బాయిల్డ్ ఎగ్‌తో పాటు బోన్ సూప్‌ను అందిస్తున్నామని ఆయన తెలిపారు.

## మైనార్టీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం



తారీక్ అన్సారీని సత్కరిస్తున్న ముజీబ్ హుస్సేని

అబిడ్స్: అన్ని వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన తారీక్ అన్సారీని టీఎన్జీఓస్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. ఉద్యమ నాయకులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఉద్యమ నేత తారీక్ అన్సారీని మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బి.శంకర్, మహ్మద్ అబ్దుల్ మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం.. తప్పిన ముప్పు

డబీర్‌పురా: డబీర్‌పురా పీఎస్ పరిధిలోని నూర్‌ఖాన్‌బజార్‌లో మంగళవారం రాత్రి ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. డబీర్‌పురా నూర్‌ఖాన్‌బజార్‌లోని సిల్వర్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లోని 505 ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్లాట్‌లో జగ్నేకీ రాత్ సందర్భంగా నిర్వహించిన క్యాండిల్ కిందపడి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు పోలీసులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సోఫాలు, వాషింగ్ మెషిన్, టీవీ దగ్ధమైనట్లు యజమాని ఫైజాన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరో కేసు నమోదు

అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని రోడ్లపై ప్రయాణించే వాహనదారులపై, బహిరంగ ప్రదేశాల్లో అన్యమతస్తులపై రంగులు చల్లడంపై నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ జారీ చేసిన నోటీసును జతపరుస్తూ ఎమ్మెల్యే రాజాసింగ్ తన ట్విట్టర్ ఖాతాలో వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను మంగళ్‌హాట్ పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మంగళ్‌హాట్ పోలీసులు తెలిపారు. ట్విట్టర్ ఖాతాలో రాజాసింగ్ పోస్టు చేసిన వ్యాఖ్యలు ఒక వర్గం ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్నందున కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు. గురువారంలోపు ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

## యూ టర్న్ వద్ద అక్రమ పార్కింగ్

గోల్కొండ: యూ టర్న్‌ల వద్ద అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. టూంబ్స్ చౌరస్తా నుంచి షేక్‌పేట్ నాలా వెళ్లే రోడ్డుపై గుల్షన్ కాలనీ మలుపు ముందు వాహనాల రాకపోకల కోసం యూటర్న్ ఏర్పాటు చేశారు. షేక్‌పేట్ నాలా నుంచి గుల్షన్ కాలనీకి వెళ్లాలంటే ఈ యూటర్న్ తీసుకుని వెళ్లాలి. గుల్షన్ కాలనీ, మినీ గుల్షన్ కాలనీవాసులు సైతం గోల్కొండ సమతాకాలనీ వైపు వెళ్లాలంటే ఈ యూటర్న్ ద్వారానే వెళ్లాలి. అయితే యూ టర్న్ ఎదురుగా ఉన్న రెస్టారెంట్లు, ఇతర షాపులకు వచ్చే వారు కార్లు, ద్విచక్రవాహనాలను పార్క్ చేస్తున్నారు. వాహనాలు వెళ్లడానికి మాత్రం కొద్ది స్థలాన్ని వదిలేస్తున్నారు. అయితే దీని వల్ల కార్లు, ఆటోలు రోడ్డు దాటి వెళ్లలేని పరిస్థితి ఉంది. ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లను నిరోధించాలని వాహనదారులు కోరుతున్నారు.

## పాతబస్తీలో పోలీస్ బందోబస్తు



చార్మినార్ వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్: ఒక వైపు హోలీ వేడుకలతో పాతబస్తీ రంగులమయం కాగా మరో వైపు జగ్నేకీ రాత్ వేడుకలతో పాతబస్తీలోని మసీదులన్నీ సందడిగా మారాయి. ఇరువర్గాల వేడుకలు ఒకే రోజు ఉండడంతో నగర పోలీస్ కమిషనర్ సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావివ్వకుండా అదనపు బలగాలతో బందోబస్తు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో కలిసి పాతబస్తీలో పర్యటించారు. చార్మినార్ ప్రాంగణంలో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. హిందువులకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఆయన ముస్లింలకు షబ్–ఏ–బరాత్ (జగ్నేకీరాత్) ముబారక్ తెలిపారు.

## ఉత్సాహంగా హోలీ వేడుకలు



సందడి చేస్తున్న చిన్నారులు



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు, నాగ్‌నాథ్



హోలీ సంబరాల్లో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

చార్మినార్: పాతబస్తీలో బుధవారం హోలీ వేడుకలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు టి.ఉమామహేంద్ర ఆధ్వర్యంలో చార్మినార్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టిని కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

**ఏబీవీపీ ఆధ్వర్యంలో..**

అఖిల భారత విద్యార్థి పరిషత్ కోఠి జిల్లా సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం హోలీ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కోఠి జిల్లా కన్వీనర్ కల్యాణ్, నగర కార్యదర్శి నితిన్, కళాశాల అధ్యక్షుడు దిలీప్, రాహుల్, అనూష, అరవింద్, ప్రియ, రమేశ్, శివ, రాహుల్, రితికేష్ పాల్గొన్నారు.